# మా ఇంట్లో దీపావళి

జాగర్లమూడి సాంబశివరావు

**చతుర్దశి :**

## కాకా హొటల్ రేడియోలోంచి ఘంటసాలపాట:

"మనసుగతి యింతే"

ఎంత బాగా చెప్పాడు-
మన (సు) కవి ఆత్రేయ!
"మనసే ఒక మందిరం"
"మనసే ఒక వానరం"
అన్న కవులూ వున్నారు.
ఏమిటో పాడు మనసు?
మనసనేది లేకపోతే - మనుషులు
ఎంచక్కా పశువులకంటె నిశ్చింతగా.

పశువులు నిశ్చింతగా వుంటాయని ఏకవీ చెప్పలేదు!

పోనీ - పురుగుల్లాగ....పులుగుల్లాగ....
పుట్‌పాత్ మిద ఆగి,
ఒక్కసారి తల విదిలించి,
సిగరెటు ముట్టించాను.
నిప్పును చూచిన ఎలుగ్గొడ్డులాగ
చప్పున తోక ముడిచింది మనసు.

ఉదయం నుంచి ఒకటే గోల.
ఆఫీసులో పనిచేసుకొనిస్తేనా!
బొత్తిగా బుద్ధిలేని మనసు —
నాతో పుట్టి - నాతో పెరిగి
నాతో వుండక - మధ్యలో
వచ్చిన మాధవితో వుంటుందా!
తనతో పాటు నన్నూ రమ్మంటుందా!
ప్రొద్దున జరిగిందేమిటి?
హద్దులు మీరిందెవరు?
నేనా - తనా?

*

"యాఁవండోయ్! మిమ్మల్నే."

ఆ పిలుపులోని పులుపు, యిరుగుపొరుగు రుచి చూడాలని కాకపోతే, అంత బిగ్గరగా, గొగ్గిరిగా ఎందుకు పిలవాలి?

కొత్తవాళ్ళు వింటే-నాకు చెవుడనుకోరూ తను కాపురానికి రాగానే, అత్తగారు హోమ్ శాఖను అప్పగిస్తూ - "అబ్బాయి కొత్త దుడుకు-ఎలా దారికి తెస్తావో" అని, అలుసిచ్చినంత మాత్రాన, అమలు సాగించటం ఆదర్శ గృహిణి లక్షణమా?

కష్టం నాది - ఇష్టం ఆమెదా?
అర్జన నాది - ఆర్భాటం ఆమెదా!
ఇకపై చెల్లదుగాక చెల్లదు.

ఏ "యిజం" ప్రకారం చూసినా, ఆర్థిక శాఖకు గృహశాఖ లోకువే!

ఎంత ఎర్ర ముక్కోణపు సంసారమైనా ఈ అధిక ధరల కాలంలో పొదుపు చెయ్యాలన్న ఇంగితం లేకపోయె!

* * *

"వస్తారా? రమ్మంటారా?"

భాష సరళమే! భావం గరళం!

మాట్లాడుకున్నా, పోట్లాడుకున్నా-వంటిల్లే నయం.

ఎందుకైనా మంచిదని నేనే వెళ్ళి- "హియర్ మేడమ్" అన్నాను.

కత్తిపీటను ఎత్తి పడేస్తూ—

"సంతోషించాంగాని, అటు చూడండి" అంది.

చూశాను.

పదేళ్ళ నానిగాడు పద్మాసనంలో—
ఏడేళ్ళ బాబిగాడు కూర్మాసనంలో—
ఐదేళ్ళ బేబీ మత్స్యాసనంలో—

ఇడ్లీప్లేట్ల మిద వాలుతున్న ఈగలు భస్మమయేలా చూస్తున్నారు.

వాళ్ళ లెక్కలో అది- నిరసన దీక్ష. శ్రీమతి దృష్టిలో నిరశన దీక్ష. నా ధోరణిలో చెప్పాలంటే-తాత్కాలిక సమ్మె.

అదిన్నీ చట్ట విరుద్ధం.

"ఆకలి కాలేదేమో"-అన్నాను.

బేబీ మూల్గింది.

బాబిగాడు మొరిగాడు. నానిగాడు గొణిగాడు.

"అజీర్తి అయితే ఆసుపత్రికి తీసికెళ్ళే దాన్ని. మీతో పనేమిటి?" మూతి విరిచింది శ్రీమతి.

"అజీర్తి కాకపోతే అల్లరి. వాళ్ళని అదుపులో పెట్టే డ్యూటీ హోమ్ శాఖదే."

"అందుకే తమర్ని పిలిచాను. అర్జంటుగా ఓ పది రూపాయలు మంజూరు చెయ్యండి."

"డబ్బెందుకని అడిగే హక్కు ఆర్థిక మంత్రి కున్నది మరి"

"రేపే దీపావళి పండుగ."

"దీపావళి అనేది పండుగ కాదు; దండుగ."

"ఇంట్లో శాంతికోసం, కాంతికోసం దండుగ చేయక తప్పదు."

"శాంతిని కాంతిని యిచ్చేది బూడిదే కదా! ఓ డబ్బాడుతెచ్చి వాళ్ళముందు పొయ్! ఇంచక్కా ఆడుకుంటారు."

శ్రీమతి ముఖంలో కమ్ముకుంటున్న కారు మబ్బుల్ని చూడలేక, కాళ్ళకి బుద్ధి చెప్పాను.

వాకిలి దాటకముందే-యింట్లో బాజా భజంత్రీలు మ్రోగాయి. వెనువెంటనే నాదస్వరాలు తారాస్థాయికి చేరాయి.

వెనక్కి తిరిగి చూశాను.

ముగ్గురి వీపులూ మ్రోగించిన మాధవి. ముక్కు చీదేస్తూ, తనకు పెళ్ళిచేసిన పేరయ్య మొదలు ఆశీర్వదించిన తాతయ్య వరకు పేరు పేరున శపిస్తోంది.

ఇదే పతివ్రతల కాలమై వుంటే-
శాపగ్రస్తులంతా కట్టగట్టుకొచ్చి,
నా కాళ్ళమీద పడేవాళ్ళు.

అప్పుడు నేను చుట్టాలబెడద తప్పించుకోడానికైనా - ఆమెకు లొంగిపోవలసి వచ్చేది.

ఇన్నేళ్ళుగా తనే గెలుస్తోంది.

ఈ సారి లొంగనుగాక లొంగను.

తన లెక్కలో దీపావళి పెద్ద పండుగ:
నా లెక్కలో శుద్ధ దండుగ!
టపాసులు కావాలట టపాసులు.

ఆర్నాలైనా, నూరాలైనా బూడిద కోసం. డబ్బు ఖర్చు చేసేది లేదు. ఆ డబ్బుతో ఒక దీనవదనం వెలిగిస్తాను. అదే నాకు దీపావళి.

తిండిలేక యేడ్చేవాళ్ళు యేడుస్తుంటే,

బూడిదకోసం యేడ్చేవాళ్ళపైన జాలిపడాలా ఎంత మౌఢ్యం!!

* * *

మౌఢ్యం కాకపోతే మరేమిటిది?

మార్వాడి బజారులో మనసును నిలేసి అడిగాను. అది జవాబు చెప్పేస్థితిలో లేదు.

విద్యుద్దీపాల తోరణాలతో అలంకృతమైన మేడలముందు బూడిద రాసులు పడుతున్నాయి వేలాది రూపాయలు బాణసంచా రూపంలో కాలిపోతున్నాయి.

సందుగొందుల్లో పేదా బిక్కీ నిల్చుని, కుబేరుల సరదాలను తిలకిస్తున్నారు.

డొక్కలు పీక్కుపోయిన దరిద్రుల ముఖాలలో కాంతి నింపలేని ఈ దీపాల పండుగ కేవలం కలవాళ్ళ పండుగ.

పేదవాడి నెత్తి విరగ్గొట్టి వడ్డీ పిండిన కుబేరుడు ధనలక్ష్మికి చేస్తున్న జాతర కాదూ యిది!

నా ప్రశ్నలను వినలేకపోతోంది మనసు. దానిగోల దానిదే!

దద్దరిల్లి చేస్తున్న ధ్వనులు, మిరుమిట్లు గొల్పుతున్న కాంతులు-దానికెంతో ఆహ్లాదకరంగా వున్నాయిట!

మాధవితో మైత్రి చేసిన మనసు, నన్ను ఫాలో కాలేకపోతోంది.

ఎలాగైనా దాన్ని-దారి మళ్ళించాలి.

ఆ పట్టుదలతోనే మార్వాడీ వీధికి లాక్కొచ్చాను.

ఏం లాభం! దాని బుద్ధి మారితేనా!

మార్వాడీ వీధిలోంచి, చిన్న బజారులో అడుగు పెట్టాను.

బాణసంచా అంగళ్ళవద్ద తొడతొక్కిడిగా వుంది.


చేతులార డబ్బును బూడిద చేయడానికి జనం వెర్రిగా ఎగబడుతున్నారు.


"వీళ్ళందరూ తలకొక్క రూపాయి చొప్పున దరిద్ర నారాయణుల సంక్షేమనిధికి చందాలు యివ్వడానికి ఎగబడితే ఎంత బాగుండును" స్వగతం విని, ఎగతాళిగా నవ్వింది మనసు.

నవ్విన నాపచేను పండేది రేపే!

అందుకే మౌనంగా నడువసాగాను.

"ఓమ్ హోమ్ నిన్నేనోమ్."






రెక్కపట్టి ఆపాడు కాంతారావు.

నా పరధ్యానానికి నాకే సిగ్గేసింది.

"మందులు ముందే కొనేశావేమి టోయ్?"

"అబ్బే.... లేదు"

"ఐతే... రా, ఈ అంగడి మనవాడిదే? ముక్కూముఖం తెలినివాడి దగ్గరకొంటే-కల్తీమందు లిస్తాడు; కాలి చావ్వ"

వద్దంటున్నకొద్దీ, దాదాపు వంద రూపాయల సరకు - రెండు భాగాలుగా ప్యాక్ చేయించాడు.

"ఇదే సరుకు యింకో చోటైతే-అరపై దాటేది"

ఒక ప్యాకెట్టును నా చేతికి అందివ్వ బోతూ, తన పలుకుబడిని చాటుకున్నాడు కాంతారావు.

యాభై రూపాయల విలువచేసే. నిప్పు మూటను. ముట్టుకోకుండానే-" అక్కర్లే దండీ! మా ఆవిడ తనికెళ్ళే వుంటుంది" అన్నాను.

కాంతారావు కొత్త చిన్న బుచ్చు కున్నట్టే కనిపించాడు.

ఇంతలో మనసు మాట్లాడింది.

'ఆత్మ వంచన....అబద్ధం కవలపిల్లలు'

"కావచ్చు. కానీ—ఎవరికీ హానిచెయ్యని పిల్లలైతే నీకేం నష్టం?"

మళ్ళీ మాట్లాడలేదు మనసు.

కాంతారావు కాఫీకి రమ్మన్నాడు.

ఇంతకుముందే తాగానని చెప్పి తప్పు కున్నాను.

* * *

నరకాసురుని మృతికి సంతాప సూచకంగా కాబోలు-

వీధిలైట్లు చీకటి బ్యాడ్జిలు పెట్టుకు న్నాయి.

ఇరుగుపొరుగు యిళ్ళముందు పిల్లలు మతాబాలు వెలిగిస్తున్నారు.

మా ఇంటి గుమ్మం దాటాలంటే-మూడు మెట్లెక్కాలి.

ఇంట్లోకి వెళ్ళాలంటే జంకుగా వుంది.

ఇల్లు చీకటి గుహలా వుంది.

రెండు మెట్లెక్కానో లేదో - పై మెట్టు మించి వీధిలోకి మెరుపుతీగ దూసుకు పోయినట్లయింది. కళ్ళు నులుముకొని వీధిలోకి చూస్తునుకదా - అందాక అక్కడా గిన రిక్షా కదలిపోతోంది.

గుమ్మంలోనే స్వాగతం పలికింది మాధవి. అసలా-అప్పుడే క్షణాలక్రితం మెరుపుతీగను పీడోక్కలిల్చిందన్నమాట :

"ఎవరామె?"—నా ప్రశ్న.

"ఒక అర్ధాంగి"—తన జవాబు.

పెళ్ళాం కోర్కెలు తీర్చని పెనిమిటి కోపం పెదవికి చేటన్న సూక్తి. ఏగ్రంథం లోనూ లేకపోయినా- వున్నట్లే భావించి. మౌనం పాటించాను.

నా వెనుకే అడుగులో అడుగువేస్తూ-

"ఆమె కెందుకు అన్యాయం చేశారు?" అన్నది మాధవి.

చెప్పొద్దూ నా గుండె గుభేల్మంది.

అడుగు ముందుకు వేయలేక, ఆలి ముఖం చూడలేక. హాలులో శిలలా నిలబడ్డాను

ఆమె ఏపనిలో తెలియదు.

అసలు ఒక ఆడదానికి అన్యాయంచేసే అర్హతగాని, అవకాశంగానీ- వుంటేకదా?

అందగాడనా? కాదు—

ఆస్తిపరుడనా? కాదు—

ప్రేమికుడనా? కానేకాదు.

ఆడవాళ్ళ కళ్ళలోకి చూడ్డానికైనా సాహసంలేని పిరికి పందను.

ఆఖరికి ఆలినే ఆపాద మస్తకం చూడలేకపోయిన లజ్జాలంకృతుడను.

ఏమో! కాలం బాగా మారిపోయింది.

పూర్వజన్మజ్ఞానం కలిగిందేమో ఆమెకి!

ఇటీవలి సినిమాలలో పునర్జన్మలు పుంఖాను పుంఖాలుగా సంభవిస్తున్నాయి. డాక్టర్ కోవూర్ శ్రమను వృధా చేస్తున్నాయి.

ఈ ఆలోచనలో నూతనోత్తేజంపొంది. ధైర్యాన్ని ప్రోగుచేసికొని- 'ఏ జన్మలో చేసిన అన్యాయమో - అడిగిచూశావా?' అన్నాను.

"ఈ గుమాస్తా జన్మలోనే స్వామి"

ఒక్క నిమిషం సింహావలోకనం చేసు కున్నాను. గుమాస్తా జీవితంలో ఎక్కడా ఒక్క ఆడది ఇటపడిన ఘట్టంలేదు.

ఆ మాటే అన్నాను.

"ఆమె పేరు పావని"

ప్రాచీనమైన పేరు. ఈ జన్మలోది కాదేమో! (స్వగతం)

"కాంతారావుగారి భార్య"

నస్సెస్సు విడిపోయింది. ముమ్మాటికీ ఈ జన్మలోని మనిషే!

"ఈ దీపావళికి తప్పకుండా, ఖరీదైన చీరను పావనికి ప్రెజెంట్ చేస్తానని, గత దీపావళికే శపథం చేశారట కాంతా రావుగారు"

"అదృష్టవంతురాలు."

"మీరు సైంధవుడులాగా అడ్డుపడక పోతే, తన అదృష్టంలో నాకూ వాటా యివ్వాలనుకుందట - పాపం!"

నన్ను సైంధవునితో పోల్చినందుకు. ఎంతమాత్రయినా బాధ కలుగలేదు. నిజానికి సైంధవుడు చేసిన నేరమేమిటి?

తన శక్తియుక్తులతో భీమాదులను అడ్డగించి. పద్మవ్యూహం పరువుకాపాడి, వీరధర్మం నెరవేర్చాడు. అలాకాకుండా, అభిమన్యునికి సాయపడివుంటే- కృతఘ్నుడయ్యేవాడు! స్వామిద్రోహి అయ్యేవాడు!

"మీరు తినరు; సాటివాళ్ళను తిన నివ్వరు. ఇదేం బాగోలేదండీ"

పుట్టి, పెరిగి బుద్దెరిగినాక, తెలిసి తెలిసి, ఎవ్వరి నోరూకొట్టిన పాపానపోయినవాడిని కాకపోవడంతో – కాస్త కోప్పడ్డమాట నిజమే :

"నీతి....నీతి.... నీతి .... మీరొక్కరే దేశాన్నుద్ధరించడానికి పుట్టినట్టు."

అంత గొప్పవాడిని కానిమాట నిజమే :

కానీ–నీతిగా బ్రతికే హక్కు నాకుంది.

"ఆ అలగా జనానికి ఇండ్ల స్థలాల విషయంలో మీరు కాస్త నోరు మూసుకుంటే. ఆపైన అంతా కాంతారావుగారే చూసుకునే వారు కదా".

పావని ఘాటుగా మాధవిని కాటువేసి వట్లుంది, ఆ విషం కాలూకు నిషా దిగే దాకా. ఆమెతో ఘర్షణ పడకూడదనుకున్నాను,

నిలువ నీడలేని నిరుపేదలు, నివేశన స్థలాలకోసం పెట్టుకున్న అర్జీలు, పై అధికారుల కళ్ళజోళ్ళు కూర్చునే బల్లమీదికి చేర్చటం మా వుద్యోగ ధర్మం. సదరు ధర్మ నిర్వహణకు వెయ్యి రూపాయల ముడుపు చెల్లించాలి :

ఇదీ–పావనీపతి షరతు.

ఈ షరతును నా పేర ప్రకటించాడు.

అనగా పాపం నాదీ; ఫలితం తనదీ.

ఫలితంలో కొంత నాకూ దానం చేస్తానన్నాడు.

అటువంటి పాపాలకు, ఫలితాలకు నేను నేను అనర్హుణ్ని : (శ్రీమతి భాషలో చెప్పాలంటే అసమర్థుడ్ని :)

అంచేత గుట్టు చప్పుడు కాకుండా. అర్జీలను అధికారుల కళ్ళ ముందుకు చేర్చాను,

ఇదీ – మాధవీపతి నేరం.

* * *

ఇండ్ల స్థలాలు యిప్పిస్తామని చెప్పి, నిరుపేదల రక్తాన్ని నల్లులతో పోటీపడి సంజుకుంటున్న అమాంబాపతు దేశోద్ధారకులకు, మార్గదర్శకుడుగా వుంటున్న కాంతారావు, జరిగిన కథను తెలుసుకున్నవాడై, సరాసరి మురికిపేటకు వెళ్ళి– "ఎలాగో తంటాలుపడి అతన్నొప్పించి వారికే పని పూర్తిచేయించాను" అని, చాటుకోవడంతో, బీదలు అతనికి కృతజ్ఞతాంజలితోపాటు రెండు పెద్దనోట్లు సమర్పించారు.


అధునాతన నాగరికతకు
భారతీయ సంప్రదాయమునకు
సరితూగగల సరిక్రొత్త రకాల
చీరెలకు ప్రత్యేక నిలయమైన
'వనిత' శారీ సెంటర్ వారి
'దీపావళి' పండుగ శుభసందర్భంలో
సహృదయ శుభాకాంక్షలు !
'వనిత'
శారీ సెంటర్
కొత్తగూడెం.

సదరు బీదల ఆస్తితోనే, నూరు రూపాయల బూడిద మందుకొని, సగం నాకు దానం చేయబోయాడు.

ఈ వృత్తాంతాన్ని సవిస్తరంగా శ్రీమతికి నివేదిస్తే–ఆమె సరికొత్త బిరుదును నాకు ప్రదానంచేసే ప్రమాదం వుంది.

తెలివంటే కాంతారావుదే :

మీరూ వున్నారెందుకు ?

అడిగితే ఏంచెప్పను ?

*

## అమావాస్య :-

ఉదయాన్నే వూళ్ళోకి వెళ్ళాను.

మధ్యాహ్నందాకా బజార్లన్నీ తిరిగాను.

గత దీపావళికి నాలుగయిదు ప్రమాదాలు జరిగాయి.

ఒక మందులషాపు తగలబడింది.

ఒక గుడిసె కాలిపోయింది.

ఒక బాలిక చెయ్యికాలింది.

ఒక యిల్లాలి చీరలో భూచక్రం దూరింది. చుట్టూ వున్నవాళ్ళు వస్త్రాపహరణం చేసి రక్షించారు.

ఈ వార్తలు విన్నప్పుడు మాధవి– "నిజమేనండీ : పాడు మందులు" అనేది.

మళ్ళీ దీపావళికి మామూలే :

డబ్బును మసి చెయ్యరాదని శాసించాను గాని, పండుగ సరదాలను తిరస్కరించలేదు. తల్లీ పిల్లలకు కొత్తబట్టలు కొన్నాను. ఇంటి అవసరాలను తీర్చాను.

ఐనా–వాళ్ళు నన్ను అర్థం చేసుకోలేదు.

నాలో పెద్దపులిని చూస్తున్నారు.

నాకు దూరంగా పోతున్నారు.

క్రమశిక్షణ అనేది మానసిక వికాసానికి దోహదం చేయాలిగాని, భయానికికాదు.

ప్రతి శుక్రవారం తలస్నానం చేసి, దాపుడు చీరను ధరించే మాధవి, పండుగ పూట పాత బట్టలతో మౌనవ్రతం చేస్తోంది.

ఆవు చేలో మేస్తుంటే–దూడ గట్టున మేస్తుందా!


తల్లితోపాటే పిల్లలూ.

కళ్ళెర్రజేసి, కారణ మడిగితే–"దీపావళి–పండుగ కాదన్నారుగా" అని దీర్ఘం తీసి చెప్పిబొడిచింది నా యింటి దీపం.

మధ్యాహ్నంనుంచి, పరిస్థితి విషమించింది.

నాన్నే నరకాసురుడని పిల్లలు భ్రమించేలా, శ్రీమతి రువ్వుతోంది రుసరుసలు.

పిలిచినా దరి చేరని పిల్లలు....



తాకినా తల తిప్పని శ్రీమతి....

మాటిమాటికి రెచ్చగొట్టే మనసు....

నాకు తెలియకుండానే కాళ్ళు చిన్నబజారుకు నడిచాయి. బాణసంచా కొట్లవద్ద రద్దీ తగ్గనేలేదు.

"ఒక్క పది రూపాయలు, బూడిద కోసం కేటాయిస్తే. యింట్లో శాంతిని. కాంతిని నెలకొల్పవచ్చు." సలహా యిస్తోంది మనసు.

సడలిపోతోంది నిగ్రహం. చీకటిని చీల్చుతున్న చిచ్చుబుడ్లు-దూసుకుపోతున్న తారాజువ్వలు- నన్ను హేళనచేస్తూ. వెన్నాడి తరిమాయి. మరి కాసేపు అక్కడే వుంటే, మనసుకు లొంగేవాడినేమో!

* * *

ఇంటిని సమీపించి, మెట్లెక్కబోయి-ఆగాను. లోపలినుంచి మాటలు విని పిస్తున్నాయి.

"వద్దే రంగీ వద్దు. మమ్మల్నిలా గుట్టుగా బ్రతకనియ్! ఏ జన్మలో చేసిన పాపమో- నా బిడ్డల ఆనందాన్ని చూడలేక పోతున్నాను."

"మీరు మరీ యిదై పోతున్నారమ్మ గారు! మొగోళ్ళు లచ్చ మాటలంటారు. పట్టిచ్చుకుంటే యెట్టా!"

"మాటలు కాదే తల్లీ కంచుకోటలు.దాటి పోడానికి వీల్లేదు. మాట్లాడితే క్రమశిక్షణం టారు. దీపావళి మందులు కాల్చమంటే-డబ్బును బూడిద చెయ్యటం తప్ప మరేమీ కాదట! ఆయన రోజూ తగలేసే సిగరెట్లు మాత్రం బంగారప్పొడిగా మారుతున్నాయిట."

ఉలిక్కిపడ్డాను.

తల గోడకు తగిలి బొప్పికట్టింది.

చెర్నకోలతో బాదినట్లుంది శ్రీమతి విమర్శ.

కాని-తను ఎన్నడూ నా యెదుట అలా విమర్శించలేదు.

సిగరెట్లవల్ల ఆరోగ్యం పాడవుతుం దని హెచ్చరించిందేగాని. అవి బంగార ప్పొడిగా మారుతున్నాయా!అని ప్రశ్నించ లేదు. నేనెంత అజ్ఞానిని! ఎంత అహం కారిని!

"దిగిపోయిందా మదం?" అంటోంది మనసు.

సిగ్గుతో తల వంచుకున్నాను.

మళ్ళీ మాటలు వినిపిస్తుంటే-చెవులు రిక్కించాను.

"ఈః మొగోళ్ళంతా యింతేనండమ్మ గారూ! మా తాగుబోతోడు మాత్రం తక్కువ తిన్నాడా! అయ్గారు మా బుడ్డోడికి చొక్కా కుట్టిచ్చుకొమని నిన్న పది రూపాలిచ్చారా! కల్లు తాగొత్తాను. ఐదు రూపాలియ్యవే అన్నాడు. ఇయ్యను పోరా అంటిని. బుడ్డోడికి ఐదు రూపాలెట్టి చొక్కా కుట్టిచ్చి, మిగతా ఐదుతో మందులు కొనిస్తిని. ఆ మందు లెందు కొన్నావే దండగ - ఆయిగా కల్లు తాగేసేవోడ్ని. అంటాడు మా యింటోడు."

పని మనిషి రంగమ్మ మాట్లాడుతూ వుండగానే, యింటిముందు వెలుగు కురిసింది. రంగమ్మ కొడుకు ఐదేళ్ళవాడు, మందులు కాల్చటం ప్రారంభించాడు.

అప్పటికే మనసు నన్ను కాల్చి వెలుగు పుట్టించింది; అహం బూడిదవుతోంది.

"మీ డబ్బుతోనే ఈ మందులు కొన్నా నమ్మగారూ! పిల్లలకియ్యండి కాల్చుకుంటారు".

రంగమ్మ బ్రతిమాలుతోంది.

మాధవి - వద్దు పొమ్మంటోంది.

పిల్లలు - క్రమశిక్షణ పాటిస్తున్నారు.

మరికొన్ని క్షణాలు కాలిపోతే, క్రమశిక్షణ బూడిద కావచ్చు.

ఆలస్యం - అమృతం - విషం.

దాదాపు పరుగెత్తాను.

ఎక్కడివాడక్కడే గప్‌చుప్!

రంగమ్మ చేతుల్లోంచి మందులప్యాకెట్టు లాక్కుని. గబగబా విప్పి, పిల్లలకు పంచిపెట్టి. నేనే ముందుగా ఒక చిచ్చుబుడ్డి వెలిగించాను. అంతటితో నేనే పూర్తిగా కాలిపోయాను.

నానిగాడు. బాబిగాడు, బేబీ....ఆశ్చర్యానందాలతో నన్ను చుట్టు ముట్టారు. నా హృదయం వెలుగుతో నిండిపోయింది.

"రంగమ్మా! వెంటనే వెళ్ళి పది రూపాయల మందులు పట్టుకొచ్చి, అందరికీ ఆనందం పంచిపెట్టు" అని డబ్బులందించి వాకిలివేపు ఓరగంట చూద్దును కదా-

కొత్తచీర ముసుగులో మనసారా నవ్వింది మా యింటి దీపం. ★

గమనిక : నేను=అహం

